

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**'పుకార్లూ – పూనకాలూ'**

"విన్నావా భాగ్యమ్మా.. మన గోపాలకృష్ణా టూరింగు టాకీసులో 'నాగులచవితి' సినిమావేస్తుంటే బోలెడు పాములొచ్చి నాట్యం చేశాయిట!" మా మూడో యింటి సావిత్రమ్మ మా అమ్మతో చెబుతుంటే విన్నాను. ఆ వార్త ఎప్పుడో మాకు చేరింది. నేనూ, సరస్వతీ పుష్పం, జయవిజయలక్ష్ములూ అందరం 'డిస్కస్'కూడా చేసుకున్నాం.

"అసలు నాగస్వరం వింటేనే పాములు ఒళ్ళుమరిచిపోతాయి. మొన్న 'తిండిబెల్లు' కొట్టినప్పుడు పాములవాడు వూదుతుంటే ఆ నాగుపాము ఎంత బాగా ఆడిందీ!" కళ్ళు 'ఇంతవి చేసి అన్నది సరస్వతి.

"అవునే! సినిమాల్లో వాయించేది ఇంకా బాగుంటుంది కదా.! అందుకే బోలెడన్ని పాములు వచ్చి ఉంటై.!" జయలక్ష్మి ఉవాచ.

ఈ 'ట'లు 'టై'లు మాకు అలవాటే. శ్రీరంజని సినిమా వస్తే చాలు.. ఆడాళ్ళందరూ కట్టగట్టుకుని సినిమాకి బయల్దేరేవాళ్ళు. తెరమీద శ్రీరంజని గుక్కలు పెట్టి ఏడుస్తూ 'నా పతి ప్రాణములు కాపాడు దేవా' అంటే, సినిమా చూసే ఆడాళ్ళందరూ 'వంత' ఏడుపులు ఏడిచేవాళ్ళు.

ఏడిస్తే ఫరవాలేదు.. అది వాళ్ళ ఇష్టం. అక్కడితో ఆగకుండా ముక్కులు తెగచీదేవాళ్ళు. సెకండ్ షోకి 'నేల' టిక్కెట్టుకి వెళ్ళే వాళ్ళైతే ఛచ్చారే. బట్టలనిండా చీమిడి మరకలే. అందుకే శ్రీరంజని సినిమా అంటే నాకు భయం. సినిమా మొత్తం ఏడుపులేగదా!

అదేదో 'దెయ్యం' సినిమా వొచ్చింది. ఆ సినిమా చూసిన వాళ్ళు రాత్రిళ్ళు బయటికి వస్తే ఒట్టు. రాకపోతే మానీ, దెయ్యం ఎదురుగా వొచ్చి 'వికటాట్టహాసం చేసిందని' ఒకతీ, 'మడిచీరని బరబరా లాగిపారేసిందని' ఇంకోతీ ఇట్లా తెగ 'రూమర్లు' పుట్టించేవాళ్ళు.

ఇహ 'దేవతల సినిమాలు' వస్తే అంతే సంగతి. హాల్లోనే 'పూనకాలు' తెచ్చుకుని తెగవూగే వాళ్ళు. అప్పటికప్పుడు సినిమా ఆపి, సదరు పూనకం వచ్చిన వాళ్ళకి హారతిస్తేగానీ, తరవాత కథ తెరమీద కనపడదు.

సినిమా బండివాడు యీ విషయాల్ని మరింత గొప్పగా వర్ణించేవాడు. "సోదరసోదరీమణులారా., ఎవరైనా సరే.. ప్రస్తుతం మన గోపాల్‌క్రిష్ణా టూరింగు టాకీసులో ప్రదర్శింపబడుతున్న 'కొరివిదెయ్యం' సినిమాని 'ఒంటరిగా చూడగలిగితే వాళ్ళకి వెయ్యి నూట పదహార్ల బహుమతులు ఇవ్వబడును." అని 'ఛాలెంజ్' చేసేవాడు డబ్బు సంపాయించవచ్చు. ప్రాణం పోతే తిరిగిరాదు కదా.!

"నేను చూస్తాను.. రెడీ!" అని మా జోగారావుగాడు బండివాడితో అన్నాడు. సినిమా బండి రసూల్ జోగ్గాడికి మైకు ఇచ్చి, "యీ మాట అందరూ వినేటట్టు మైకులో చెప్పు. గ్యారంటీగా డబ్బిస్తాం. కానీ ఒకటి గుర్తుంచుకోవాలి అబ్బాయ్, ఏలూర్లో నీలాగే ఓ కుర్రాడు, ఛాలెంజ్ చేసి, సినిమా చూస్తూ చూస్తూ పడిపోయాడు. మళ్ళీ లేవలేదు.. ఆలోచించుకుని మరీ మైకులో చెప్పు!" అన్నాడు. నిమిషంలో యీ విషయం తెల్సి, "నీకిదేం పోయేకాలంరోయ్.. దెయ్యాల సినిమా నీకెందుకురోయ్.. నీకేదన్నా అయితే మేము ఏ బావిలో దూకాల్రోయ్!" అని కేకలు పెట్టుకుంటూ, రాగాలు తీస్తూ వచ్చింది వాళ్ళమ్మ. బస్.! జోగారావుగాడు నోరెత్తితే ఒట్టు.

అయితే వీటివల్ల కొంచెం 'మంచి' జరక్కపోలేదు. కల్లుతాగొచ్చి రోజూ పెళ్ళాన్ని తన్నే సైదులుగాడ్ని, దెయ్యం పట్టినట్టు యాక్టుచేస్తూ వాళ్ళావిడ కర్రతో చితకబాదింది. అంతేగాదు, "నీ పెళ్ళాం ఒంటిమీదకి మళ్ళీ మళ్ళీ ఒస్తుంటాను రోయ్. దాన్ని గనక నువ్వు తంతే, నీ మెడ కొరికి చంపుతాన్రోయ్!" అని దెయ్యం తరఫున ఓ వార్నింగు కూడా ఇచ్చింది. దెయ్యం దెబ్బతో సైదులుగాడు మంచివాడైపోయాడు.

మా అమ్మ తిట్టినప్పుడల్లా ఏ కనకదుర్గమ్మ అమ్మవారో నన్ను ఆవహించినట్లు యాక్టుచేసి మా అమ్మని బెదరగొట్టాలని నాకూ చచ్చేంత కోరికవుండేది గానీ, పరీక్షలు దగ్గరబెట్టుకుని దేవతలతో ఆటలాడకూడదు గదా! దెబ్బలాటలు వస్తే సాటి ఆడవాళ్ళతో భీకరంగా పోట్లాడే ఆడాళ్ళు, మొగుళ్ళు తిట్టినా, చితగ్గొట్టినా నోరుమూసుకుని ఎందుకుపడివుండే వాళ్ళో నాకు అర్ధమయ్యేదిగాదు.

ఆ విషయమే మా స్కూలు ఆవరణని ఊడ్చే రామిని అడిగితే, "ఆళ్ళు మొగోళ్ళు.. మనం ఆడోళ్ళం. ఆళ్ళు ఏవైనా చెయ్యొచ్చు!" అనేది. ప్రతీ ఆడదీ యీ మాటలే వల్లెవేసేది.

"మొగాడి గొప్పేంటీ?" అని మా నాన్నని ఓ రోజు అడిగాను.

"ఆర్ధిక స్వాతంత్ర్యం" అన్నాడు మా నాన్న. ఓ అరగంట ఆ విషయాన్ని వివరించాడు కూడా.

"ఆడాళ్ళు ఉద్యోగాలు ఎందుకు చెయ్యకూడదూ?" ఆరిందాలా మళ్ళీ అడిగా.

"నువ్వు చేద్దుగానిలే!" అని మా నాన్న నా భుజం తట్టాడు,... చిన్నగా నవ్వి అదే విషయం మా లేడీ టీచర్ సువర్చలగారిని అడిగితే, "ఏం చెప్పినా యీ వయసులో మీకు అర్ధంకాదు. ఆడపిల్లలు బాగా చదువుకుంటేగానీ యీ పరిస్థితి మారదు.!" అని నిట్టూర్చారు.

ఇప్పుడు ఆలోచిస్తే అర్ధమవుతోంది. ఆ రోజుల్లో ఈతిబాధలు తప్పించుకోవడానికి ఆడవాళ్ళకి (కొందరు) ఉన్న మార్గాలు. దెయ్యం పట్టినట్టో అమ్మవార్లు ఒంటిమీదకు వచ్చినట్టో నటించడం.

ఆ 'నటన' రాని వాళ్ళు చచ్చినట్టూ తిట్లూ దెబ్బలూ భరించాల్సిందే!

ఇంకో రకం 'పూనకం' మొదలైంది. ఓ కార్డు ఇంటికి వొస్తుంది దానిలో, "నమస్తే! యీ కార్డు అందిన వెంటనే, "శ్రీ విజయభగవతీనమోనమః' అని పదకొండుసార్లు జపిస్తే అనుకున్నపని వెంటనే జరుగుతుంది. అయితే ఈ ఉత్తరంలో రాసినట్టుగానే వందమందికి మీరు ఉత్తరాలు వ్రాయకపోతే, ఊహించని కష్టనష్టాలు కలుగును. ఇట్లు - అపరిచిత భక్తుడు" అని వుంటుంది. పాపం పుష్పకుమారి అయితే వందకార్డులు అంటే ఆర్రూపాయలు.. నేనెక్కడ్నించి తెచ్చేదే అని గోలపెట్టింది. చిత్రంగా అదేరోజున నాకూ ఉత్తరం వచ్చింది. మానాన్న డబ్బులిస్తాడుగానీ, రాయాలంటే బద్ధకమాయే! రాయకపోతే ఏం జరుగుతుందో అన్న శంక. సరాసరి ఆశ్రమానికి పోయి మా స్వామీజీకి యీ వుత్తరం చూపించి 'ఏం చెయ్యమంటార'ని అడిగా.

"ఏమీ చెయ్యక్కర్లా. హాయిగా ఇంటికిపోయి పుస్తకాలు చదువుకో!" అన్నారు.

"మరి కష్టనష్టాలు వస్తాయని ఉందిగా?" మళ్ళీ అడిగా.

ఆయన పకపకా నవ్వి, "వంద ఉత్తరాలు వేళ్ళు నెప్పిపుట్టేట్టు రాయటం 'కష్టం', దానికోసం ఆర్రూపాయలు ఖర్చుపెట్టడం 'నష్టం'. నువ్వా ఉత్తరాన్ని చించిపారేశావనుకో, కష్టం, నష్టం రెండూ వుండవు!" అన్నారు. నాకు అప్పటికిగానీ ధైర్యం రాలేదు. ఆ విషయమే పుష్పకుమారికీ మిగతా అందరికీ చెప్పి వాళ్ళ 'భయం'కాస్త తగ్గించా.

మీరసలు ఊహించలేరు.! ఆ రోజుల్లో ఓ పుకారు ఉండేది. 'ఫలానా' దేవుడికి మొక్కుకుంటే ధనలాభం కలుగుతుందని. అట్లాగే పెళ్ళికాని వాళ్ళకి పెళ్ళవుతుందనీ, పిల్లలు లేనివాళ్ళకి పిల్లలు పుడతారనీ ఇట్లా తెగ పాప్యులర్ అయిపోయిందా పుకారు. దానికి, అంటే ఆ

మొక్కుకి విధిగా పాటించవలసినది ఏమంటే, ఏడాదిపాటు 'ఎడం చేత్తో' అన్నం తినాలిట. పొరపాటున కూడా ఆ మొక్కు తీరేంతవరకూ కుడిచేత్తో భోజన పదార్థాలు ముట్టుకోకూడదుట.

ఈ కథ వినంగానే నాకు కడుపులో తిప్పింది. ఆ మాట చెప్పింది మామూలువాడు కాదు. బియ్యేస్సీ పాసై తాలూకాఫీసులో ఉద్యోగం చేస్తున్నవాడు. ఆయన ఆ 'వ్రతాన్ని' ఆచరిస్తూ ఎడం చేత్తోనే తింటాట్ట! వాళ్ళింట్లో ఆయన 'పురచేతి' వైభవం చూసి ప్రశ్నిస్తే, ఆయన చెప్పిన వివరం ఇది. వాళ్ళావిడ పూరీలేవో పెట్టాలని ప్రయత్నించిందిగానీ, అసలు ఆ కొంపలో మంచినీళ్ళు అయినా తాగబుద్ధి అవుతుందా?

విస్తరీ కంచంలాంటివి వాడకండా, నేలమీద అన్నం పెట్టుకు తినడం మరో మొక్కు.

మంగళవారం మౌనవ్రతం మరో మొక్కు. ఈ మొక్కు రెండు మూడు మంగళవారాలపాటు మా అమ్మ పాటించింది. వాళ్ళ అమ్మకి జ్వరం ఏదో వొస్తే, అది అర్జంటుగా తగ్గిపోవాలనీ, మళ్ళీ అసలు జ్వరమే రాకూడదనీ, వాళ్ళ నాన్నా అన్నయ్యలూ (వదినలు కాదు..గమనించండి) ఆయురారోగ్య ఐశ్వర్యాలతో కళకళలాడాలనీ, తోబుట్టువుని, అంటే, మా అమ్మని కంటిపాపలా చూసుకోవాలని మొక్కిందిట. దొరికిందిరా ఛాన్సు అనుకున్నా.

మొదటి మంగళవారం రావడం ఆలస్యం,.. "ఏమే పెదపాడు మాలక్ష్మి కూతురా, నువ్వూ నీ వాళ్ళు బాగుండాలని వ్రతం పట్టావు. ఇన్ని పతివ్రతల సినిమాలు చూశావుగదా!. ఆ పతివ్రతలు బావురుమని ఏడుస్తూ 'నా పతిని రక్షించండి' అంటూ దేవతలకి మొరలు పెట్టుకోవడం విన్నావుకదా, మరి నువ్వు మొక్కిన మొక్కుల లిస్టులో మా నాన్న పేరూ నా పేరూ ఎందుకులేదే?" అని తగులుకున్నా. మౌనంగా వుండాలి గనక కళ్ళెర్ర జేసీ, పళ్ళు బిగించీ, కోపాన్ని ప్రదర్శించింది గానీ మాట్లాడే ధైర్యం చెయ్యలా. అదేగా మనకి కావల్సిందీ!

"నువ్వెప్పటికీ నీ పుట్టింటిదానివే గానీ, 'మా ఇంటి' దానివి కావే సుబ్బారావు పెళ్ళామా.! మీ కాలు విడిచిన మావయ్యో, వేలు విడిచిన మావయ్యో సపరివార సమేతంగా వచ్చాడని గారెలూ బూరెలూ తినబెట్టావుగానీ, అయ్యో పాపం ఆయన ఎంత అలిసిపోయి ఇంటికొస్తాడూ, పాపం ఆ సీత ఎంత చదివి చదివి నీరసించి ఇంటికొస్తోందీ అని ఒక్కసారి ఆలోచించావుటే, బలం కోసం కాసిన్ని బంగాళాదుంపలు ఎర్రగా వర్రగా వేయించి, దానికి తోడుగా కాస్త బీరకాయ పచ్చడి జాగ్రత్తగా నూరి, నాలుగు అప్పడాలూ వడియాలు వేయించి, చక్కగా కాస్త పెరుగుపచ్చడి జోడించి పెడితే నీ సొమ్మేం పోయిందే? పైసలు నాన్నవీ ఫలహారాలు మీవాళ్ళకా?" అని చేతులు తిప్పుతూ (ఆవిడలాగే) ఉపన్యాసం దంచేశా.

ఓ కర్రముక్క పట్టుకుని పిచ్చికోపంతో నామీద కొచ్చింది. నేను దొరికితేగా.

"మౌనవ్రతం రోజున శాంతంగా వుండాలి. ఇలా కర్రలూ పలుగులూ పట్టుకుని కొట్టడానికి వస్తే మొక్కు తీరటం సంగతి అటుంచి, చేసిన పుణ్యమంతా వృథా ఔతుంది. కావాలంటే శ్రమంలో అడిగిరా" గంభీరంగా అన్నాను. మా అమ్మ పుణ్యం కోసం గేదె కాళ్ళు కడగమన్నా కడుగుతుందని నాకు తెలీదా!

రకరకాల భావాల్ని కళ్ళతోటీ పళ్ళతోటీ తలవూపుడుతోటీ ప్రకటించి, అరుగు మీద కూలబడ్డది మా అమ్మ.

నాకు అర్ధమైందేమిటంటే, "నీ సంగతి ఇప్పుడు కాదే, సాయంత్రం 'మౌనవిరమణ' అయిన తరవాత చెబుతా!" అని.

దానికి ఇంకా చాలా టైము వుందిగా... యీలోగా నాన్న ఎట్టానూ రానేవస్తాడుగా. "అవునే అమ్మా.. వారానికి ఒకరోజే ఎందుకూ? మొత్తం వారంరోజులూ మౌనం పాటిస్తే అనంతమైన పుణ్యం దక్కుతుందేమో శాస్త్రిగార్ని కనుక్కోమంటావా?" అని నా టీజింగ్‌ని పొడిగించా.

మా అమ్మ మళ్ళీ కోపంతో మొహం మటమటలాడించింది. పెద్దపులిచూస్తున్నట్టు నావంక చూసింది. చెప్పొద్దూ.. ఇవాళ 'తాషా మర్వా' తప్పదనుకున్నా. కోర్టులో పని అయిపోయినట్టుంది. మా నాన్న వచ్చేశాడు. వస్తూనే, "ఇవాళ సినిమాకి పోదాం.. కార్తవరాయని కథ" అన్నాడు.

సినిమా పేరెత్తితే చాలు మా అమ్మ మొహం వెలిగిపోతుంది. ఇప్పుడు వెలిగింది. అంటే ఇవాళ చెయ్యాల్సిన 'తాషామర్వా' కార్యక్రమం వాయిదా పడ్డట్టే!

"అదేంటి నాన్నా.! ఇప్పటికిప్పుడు రెడీ కమ్మంటే ఎలా రెడీ అవుతుందీ? అదీగాక, 'పాపం మీ నాన్న యీ మధ్య కాస్త చిక్కారే సీతా, బలం పట్టాలంటే మంచి భోజనం ఏర్పాటు చెయ్యాలి. ఇవాళ బంగాళాదుంపల వేపుడూ, బీరకాయ పచ్చడీ అప్పడాలూ వడియాలూ ఇంకా కాస్త కొబ్బరి పెరుగుపచ్చడీ చేద్దామనుకుంటున్నానే! ఆయన బాగుంటేనే కదా మనమూ బాగుండేది' అంటూ మంగళసూత్రాలు కళ్ళకద్దుకుంది. అవన్నీ చెయ్యకుండా సినిమాకి రమ్మంటే ఎలా వస్తుందీ?" నేక్‌గా ప్లేటు ఫిరాయించా.

"అవునా భాగ్యం.. చిక్కానంటావా?" అమాయకంగా అడిగాడు మా నాన్న.

'అవునవును' అన్నట్టు మా నాన్న వంకచూసి తల ఆడించి, నావంక 'కొరకొరా' చూసింది. మా అమ్మ, రెండు గంటల్లో సినిమా పెట్టుకుని ఇవన్నీ చెయ్యాలంటే ఎలా కుదురుతుందీ!

"పోనీలే నాన్నా ఇవాళ బంగాళాదుంపల వేపుడూ, కందిపొడీ, పెరుగుపచ్చడితో సరిపెట్టుకుందాం. బీరకాయ పచ్చడి అప్పడాలంటావా? రేపు చేస్తూందిలే. అదీగాక ఇవ్వాళ మౌనవ్రతం కూడానూ.!" అన్నాను.

"సరే... సరే! తొందరగా తెమలండి" అన్నాడు మా నాన్న కోటు తీసి చిలక్కొయ్యకి తగిలిస్తూ.

మిర్రిమిర్రి నావంక చూసి లోపలికి పోయింది మా అమ్మ.

"మీరు హాయిగా కుర్చీ టిక్కెట్లు కొనుక్కుని కూర్చోండి నాన్నా. నాకు మాత్రం బెంచీ టిక్కెట్టు చాలు. డబ్బులు నాకు ఇచ్చేస్తే నా టిక్కెట్టు నేనే కొనుక్కుంటా. ఇప్పట్నించే నేర్చుకుంటేగానీ రేపు తెలీదుగదా!" అన్నా.

"అవునవును. బజారుకెళ్ళి కూరలూ అవీ కూడా తేవడం నేర్చుకోవాలి. ఇదిగో, నీ ఫ్రెండ్సు ఎవరైనా వస్తే వాళ్ళనీ తోడు తీసికెళ్ళు!" అంటూ విచ్చు రూపాయి బిళ్ళ ఒకటిచ్చాడు. "ఇదిగో మా టిక్కెట్లు కూడా నువ్వే కొనుక్కురా!" అంటూ ఇంకో రెండ్రూపాయలు ఇచ్చాడు.

సరస్వతిని తీసుకుపోదామనుకున్నాగానీ, అది పిరికిది. అందుకే మధూగాడింటికెళ్ళి వాణ్ణి బయటికి పిలిచా.

"ఒరేయ్... పావలా పట్టుకొస్తే హాయిగా కార్తవరాయని కథ చూసొద్దాం.! బ్రహ్మాండమైన సినిమా.. మంచి తరుణము మించిపోవును. నేడే చూడు!" అని వూరించా.

"మా అమ్మ పైసా కూడా రాల్చదే!" నిరాశగా అన్నాడు.

"యీసారికి నేను పెట్టుబడి పెడతా.. కానీ వారంలోగా నా పావలా నాకు ఇచ్చెయ్యాలి. ఒట్టు!" అన్నాను.

"సరస్వత్తోడే. గ్యారంటీగా ఇస్తా!" వాడి మొహమూ వెలిగిపోయింది.

***జంప్ ఎండ్ జంప్***

ఆరింటికి 'నమోవెంకటేశా' పాటతో సినిమాహాలు నిద్రలేస్తుంది. ఫుల్ సౌండుతో ఊరంతా వినిపించి, "రండి బాబూ రండి.. వచ్చి సినిమాని చూచి తరించండి" అన్నట్టుగా ఆరుం పావుకి టిక్కెట్లు 'కొయ్యడం' మొదలెడతారు.

కౌంటరు ఓపెనయ్యేలోగా మిఠాయి నాగభూషణంగారు మిర్చి బజ్జీ, మసాలా వడగారెలు మొదలైన సరంజామాతో వచ్చి బడ్డీ తెరుస్తారు. బడ్డీ అంటే ఓ పాక, దానిలో, ఓ టేబులు, కూచోటానికి చిన్నబల్ల. ఆ బడ్డీకి తలుపులుండవు. ఒకే ఒక 'తడిక' ద్వారంలా పనిచేస్తుందన్నమాట. రాగానే ముందస్తుగా లాంతరు వెలిగిస్తాడు. దీపం పెట్టాకే సేల్సు.

బేడా పెట్టి మిరపకాయ బజ్జీలు కొని, హాయిగా ఆ నషాళానికెక్కే కారాన్నీ రుచినీ ఆనందించి, రెండు కుర్చీ టిక్కెట్లూ, రెండు నేల టిక్కెట్లూ రాయల్‌గా కొని ఒకటి మధూగాడికిచ్చా.

ఇంటికెళ్ళాక 'మౌనం'గానే మా అమ్మ కాస్త కారప్పూసా రెండు అరిసెలూ పెట్టింది. నేనూ 'మౌనం'గానే వాటిని బిగించి, టిక్కెట్లు మా నాన్న కిచ్చి "నేను విడిగావస్తా నాన్నా" అని రోడ్డెక్కాను.

నిఖార్సైన 'స్మెల్లర్స్'లో నేనూ ఒకదాన్ని గనక, బంగాళాదుంప వేపుడు వాసనని క్షణంలో పట్టేశా.

అన్నట్టు ఓ విషయం మీకు చెప్పాలి. ఇప్పుడైతే 'బంగాళాదుంప' ఏ ప్రత్యేకతా లేకండా సామాన్యపౌరుళ్ళా చతికిలబడిందిగానీ, ఒకప్పుడు అది మహారాజాధిరాజు. అన్నింటి కంటే ఖరీదైనది అదే

"వాళ్ళింటికెళ్తే బంగాళాదుంప వేపుడు చేసి పెట్టార్రా!" అని గర్వంగా చెప్పుకునేవాళ్ళు. స్పెషల్ చుట్టాలు వొస్తే మాత్రమే చేసే ఏకైక కూర బంగాళాదుంపకూర.

అట్లాగే టమోటాలూ, కాలీఫ్లవరూ, కేబేజీ, కేరట్టూ, ముల్లంగీ, బీట్‌రూటు అసలు మార్కెట్లో కనపడేవేకాదు.

చిత్రం ఏమంటే - టమోటాని 'రామములక్కాయ' అనేవాళ్ళు. అలాగే సాంబారు వుల్లిపాయల్ని 'రంభ చిలకలు' అనేవాళ్ళు.

బయటవైపు లౌడ్ స్పీకర్స్ ఏడింటికి ఆపేశారు. లోపలివైపు స్పీకర్లు 'ఆన్'అయి, 'మేలుకో' పాట మొదలైంది. రష్ చాలా ఎక్కువుంది.

నేనూ మధూగాడూ నేలగేట్లోంచి లోపలికి వెళ్ళాం.

ట్రైల్ పార్ట్ మొదలవగానే, "ఒరే., నువ్వు ఇక్కడే వుండు. నేను అటు ఆడవాళ్ళ వైపుకి పోతా.!" అని ఆడవాళ్ళవైపు కెళ్ళి అక్కడినించి బుల్లి అడ్డతడికె మీంచి గెంతి హాయిగా బెంచీమీద కూచున్నా.

టిక్కెట్లవాడు గేటు దగ్గర చూస్తాడు గానీ హాలు లోపల కాదుగదా! ఆ విషయం మనకి తెలుసుగదా!

మా అమ్మా నాన్నా లోపలికి అడుగుపెట్టడం చూసి, 'నేను ఒచ్చేశా నాన్నా' అని ఓ అరుపు అరిచా.

అంటే, 'మనం' బెంచీ టిక్కెట్టే కొన్నామని ఆయన అనుకోవాలన్నమాట.

ట్రైల్‌పార్ట్ అయ్యాక సినిమా మొదలవుతుందిగదా! మెల్లమెల్లగా వెనక్కి వెనక్కి జరుగుతూ కుర్చీలుండే చోటికి అతిదగ్గరగా వున్న బెంచీమీదకి చేరాను. జాగ్రత్తగా గమనించా. కుర్చీ టిక్కెట్టుమీద తల్లిదండ్రుల్తో పాటు అయిదారుగురు పిల్లలు కూడా రావటం చూశా.

ఫటాల్న వెదురు తడికె మీదుగా 'జంప్' చేసి కుర్చీలో మా నాన్న పక్కన సెటిలయ్యా.

"అదేమిటే? నువ్వు బెంచీ టిక్కెట్టేగా కొన్నది! ఆగు నీ టిక్కెట్టు మార్చి కుర్చీ టిక్కెట్టు తెస్తానూ!" అన్నాడు మా నాన్న.

బెంచీ టిక్కెట్టు అసలు కొంటేగదా. కొన్నది నేల టిక్కెట్టాయే. అది బైటపడితే ఎంత ఇన్సల్టు.?

"కాదు నాన్నా.. కాసేపు ఇక్కడ కూచుని మళ్ళీ బెంచీలోకే వెళ్ళిపోదామనుకున్నా.! సరే.. ఇప్పుడే మార్చుకొస్తావుండు!" అని కుర్చీ గేట్లోంచి బయటికి నడిచా.

"ఇదిగో యీ పాస్ తీసుకో అమ్మాయ్!. లేకపోతే లోపలికి రానివ్వను!" అంటూ ఔట్‌పాస్ ఇచ్చాడు గేట్‌మేన్.

"అలాగేనండీ. అయినా మీరు నాకు బాగా తెలుసండీ. నేను ప్లీడరుగారి అమ్మాయినండీ.!" అంటూ వినయంగా 'పాస్' తీసుకున్నా.

ఇప్పుడు మనం నిఖార్సైన 'కుర్చీటిక్కెట్టు' వాళ్ళమన్నమాట. సినిమాహాలు లోపలివైపు ఆవరణలో వున్న కొట్టుకి పోయి ఓ అణా బఠాణీలు కొనుక్కుని 'రాయల్'గా పాస్ గేటు వాడికిచ్చి హాల్లోకి అడుగుపెట్టా. మా నాన్న వెరీ హేపీ. తల్లిదండ్రుల్ని సంతోషపరచడం పిల్లల విధికదా.

ఈ చిన్న చిన్న కంత్రీ పనులు మీలో చాలామంది చేసేవుంటారు. అలా చెయ్యకపోతే అసలు 'మజా' ఏ వుంటుందీ? ఇంకో విషయం మీరెవరితోనైనా వాళ్ళ బాల్యం గురించి ప్రస్తావించండి. అప్పుడు చూడండి వాళ్ళ ఉత్సాహం. ఎందుకంటే వృద్ధాప్యంలో నిజమైన ఆనందాన్నిచ్చేది బాల్యపుజ్ఞాపకాలే! ఇప్పుడు నేనేమీ వృద్ధాప్యంలో అడుగుపెట్టలేదు. కానీ, జీవితాన్ని చదువుతున్న కొద్దీ, సాటి మనుషుల్ని గమనించిన కొద్దీ, బాల్యం అనేది జీవితంలో ఎంత బలమైన ముద్రవేస్తుందో నిస్సంశయంగా తెలుసుకోగలిగాను.

అసలు జీవితపథాన్నీ జీవన విధానాన్నీ, నిర్ణయించేదీ నిర్ధారించేది బాల్యమే!

పోనుపోను మీరు చూస్తారుగా!

***'కొత్తకోడ్'***

"క్కడికివి దాంపో?" అడిగింది రాధమ్మ. రాధమ్మ అక్షరాలు అజంతా శిల్పాల్లా అందంగా వుంటాయి.

"మిడి మా టకితో" అన్నది సరస్వతి.

"న్నింటికి ఎ?" జయ.

"మ్మిదితో!" విజయ.

"రిమజనంభో?" నేనన్నాను.

"జమేని.. ఆషయంవి..ర్తుగుదులే!" ఒప్పుకుంది విజయ. ఈ భాష ఏమిటంటారా? ఆ రోజుల్లో 'క' భాష మరో పాప్యులర్. 'కమీ కపే కరు వ్ ఏ కమికటి' ఇలా ప్రతి అక్షరం. ముందూ ఓ 'క'ని చేరిస్తే అది 'క' బాష అవుతుందన్నమాట. 'క'లు తీసేస్తే చెప్పాలనుకున్నది తెలుస్తుంది. ఇందాక రాసిన దాంట్లో 'క'లు తీసేస్తే 'మీపేరు ఏమిటి?' అని తెలుస్తుంది. అది ఎలా పాకిందంటే, నీళ్ళ మీద పాము పాకినట్టు స్కూళ్ళలోకి పాకింది. అందరికీ అర్థమయే 'క' భాష, యీ క్రామేడ్ సీతకెందుకూ? అందుకే సరికొత్త కోడ్ కనిపెట్టాను. ఈ సీక్రెట్ కోడ్‌ని కేవలం 'క్లోజ్ ఫ్రెండ్స్'కి మాత్రమే నేర్పాను. అందువల్ల మేం మా కోడ్‌లో మాట్లాడుకుంటుంటే వినేవాళ్ళకి ఏమీ అర్థంకాక తన్నుకుచచ్చేవాళ్ళు.

ఒకరిద్దరైతే, "సీతా.. ఆ భాష నాకు నేర్పితే కృష్ణయ్య హోటల్లో తిన్నంత టిఫిను ఇప్పిస్తాను!" అంటూ నా వెంటబడ్డారుగానీ నేనెందుకు నేర్పుతానూ.

నా ఫ్రెండ్సూ నేర్పరని నాకు తెలుసు. ఎందుకంటే మూడుసార్లు 'సరస్వతితోడు' అనిపించానుగదా!

మేం ఎవరిమీద ఒట్టేసినా దాన్ని 'గట్టు'న పెట్టడం తప్పదు. కానీ 'సరస్వత్తోడు' అని ఒట్టేస్తే మాత్రం ఆ ఒట్టుని గట్టుమీద పెట్టం. చదువుల తల్లిగదా! ఆవిడకి కోపం వచ్చి, "హూ.. నువ్వు నామీద ఒట్టు వేసి మాట తప్పుతావా? ఫో.. యీ జన్మంతా చదివినా సెకెండుఫారం పాస్‌కావు. అంతేకాదు.. అక్షరాలు కూడా మర్చిపోతావ్!" అని శాపం పెడితే మనగతేంగానూ?

సరే.. ఎన్నో ఏళ్ళయింది గనక మీ కోసం ఆగుట్టు విప్పుతున్నా. తెలుసుకునే ముందు మూడుసార్లు సరస్వతీ అమ్మవార్ని తలుచుకుని సీక్రెట్ చదవండి.

ఏమీలేదు.. పదంలో వుండే చివరి అక్షరాల్ని ముందుకు తీసుకురావడమే. అర్థంకాలేదు కదూ! ఇప్పుడు పదంలో వుండే మొట్టమొదటి అక్షరాన్ని చివరికి పెట్టండి. అర్థంకాలేదా.. పైన మా భాషలో రాసిన దాన్ని 'డీకోడ్' చేస్తున్నా. చదవండి.

"ఎక్కడికి? పోదాం" రాధమ్మ; "మావిడితోటకి" - సరస్వతి

"ఎన్నింటికి?" జయ; "తొమ్మిది.." విజయ. "మరిభోజనం?" నేను

"నిజమే.. ఆ విషయం గుర్తులేదు!" విజయ. ఎంత సింపుల్!

ఎవరినన్నా తిట్టాలనుకుంటే దీన్నే వాడేవాళ్ళం. హాయిగా తిట్టుకోవచ్చు. తిట్టింది తెలిసేది మనకేగా. "ర్వతీశం పా హామ నాసిపీ" అని పార్వతీశంగాడి ఎదటే తిట్టొచ్చు. అంటే, "పార్వతీశం మహా పీనాసి" అని. తేడా ఇంకో వెంకటేశాన్ని "డుత్తివా...ధవవె" అనగా వాడుత్తి వెధవ..'

మొదట్లో గబగబా పలకడం కొంచెం కష్టమైనా తరవాత చులాగ్గా అలవాటైపోయింది.

"ఏమిటా వెధవ భాష? బుద్ధిహీనుల్లారా!" అని మా భాషని చాటుగా విన్న ఆంజనేయుగారు అరిచినా, "ఏం లేదు మాస్టారు, అక్షరాల్ని తిరగామరగా చేసి మాట్లాడితే ఎలా ఉంటుందో చూస్తున్నాం" అన్నానేగానీ ఆయనకి చెప్పనేలేదు.

సరే అందరం ఏదో ఒక తినుబండారం తేవాలనీ అతి దగ్గరది గురవయ్యాతోటే గనక అక్కడ కలవాలనీ పన్నెండుకల్లా అక్కడుండాలనీ నిర్ణయించాం.

మేం అక్కడికి వెళ్ళినప్పుడు బ్రహ్మాండంగా కోడిపందాలు జరుగుతున్నై. అంతేకాదు.. కాయ్ రాజా కాయ్. మూడు ముక్కలు ఇలా తిరణాల బాగా జరుగుతోంది. నోట్లో కల్లో సారానో పోసుకుని, ఆ తరవాత కోడి మెడని సున్నితంగా నొక్కి దాని నోరు తెరిపించి దానినోట్లో నోరు పెట్టి దానికి సారానో కల్లో తాగించి, కాళ్ళకి కత్తులు కడితే.. ఇహ చూడండి.

రెండు నిముషాలు చూశామో లేదో, "ఏమ్మా, అందరూ ఆడపిల్లలు అసలు మీకు బుద్ధుందా.. ఇక్కడ జనాలు తెగతాగి పందాలు వేసుకుంటున్నారు. కొట్టుకుంటే తలలు కూడా 'నడానికి' పగలొచ్చు!. పదండి!" అంటూ మమ్మల్ని తోటనించి బయటకు తీసుకొచ్చి మెయిన్ రోడ్డు మీద వదిలాడు ఖాదర్.. అంటే తీగలంచ కరణంగారి జవానన్నమాట.

'కాయ్ రాజా కాయ్' వాడు మా స్కూలు ముందు ఓసారి దుకాణం పెట్టాడుగానీ, "పిల్లల్ని చెడగొడతావుట్రా గాడిదా.. మళ్ళీ యీ చుట్టుపక్కల కనిపిస్తే చంపేస్తా!" అని మా హెడ్ మాస్టారు వాడ్ని బెదిరించారు. వాడు అప్పుడప్పుడూ బస్‌స్టాండ్ దగ్గర కనిపిస్తాడు గానీ, కోడిపందాలు మాత్రం చూడటం అవాళే మొదటిసారి.

"ఒరే బాజీ.. కోళ్ళకి కల్లెందుకు తాగిస్తార్రా?" అని మా బాజీని అడిగితే "అవి మత్తెక్కి భీకరంగా ఒకదాన్నొకటి పొడుచుకునేందుకు!" అన్నాడు.

అలాగే 'పొట్టేళ్ళ' పందాలు. మనిషి మనసులో 'హింస' అనేది పుట్టుకతోనే పుడుతుందా? ఆ విషయమే మా సైన్సు మాస్టారు రామచంద్రరావుగార్ని అడిగితే, "నిప్పునిప్పుని ఆర్పగలదా? నీరు మాత్రమే ఆర్పగలదు. హింస ఒకటేగాదు, దయ జాలి క్షమ శాంతం సత్యం ధర్మం ప్రేం అన్నీ పుట్టుకతోనే వస్తాయి. మన 'విచక్షణ'ని ఉపయోగించి మంచిని మాత్రమే గ్రహించాలి. మంచిని మాత్రమే ప్రోత్సహించాలి!" అన్నారు.

మిగతారోజుల్లో ఇక్కడి 'చెంబు' అక్కడ పెట్టనుగానీ, చలికాలంలో మాత్రం చాలా పనులుచేస్తా. తెల్లవారు ఝామునే మా అమ్మలేచి ఏదో ఓ సుప్రభాతం పాడుకుంటుంది గదా. ఇక్కడ సుప్రభాతాలు అంటే 'మేలుకొలుపు'లని అర్థంచేసుకోవాలి. అప్పటికి ఇంకా వెంకటేశ్వర సుప్రభాతం 'ఫేమస్'కాలేదు. అందుకని, 'మేలుకో కావేటి రంగా' అనో, 'మేలుకోవయ్య మా బుజ్జిగణపయ్యా' అనో ఆడవాళ్ళు మొహం కడుక్కోగానే పాట అందుకునేవాళ్ళు. మా అమ్మ వేపపుల్ల వాడేదిగనక ప్రాబ్లం లేదు. నేనూ మా నాన్నా వాడేది స్వచ్ఛమైన 'కచ్చిక'ని.

ఆవిడ మేలుకొలుపు మొదలెట్టగానే నేను లేచి 'దాలి' సిద్ధంచేసేదాన్ని. అంటే పిడకల్ని చక్కగా అమర్చి కొంచెం కిరసనాయిలు విదిలించి వెలిగించడం అన్నమాట. దానిమీద కాచిన 'పాల రుచి' ఇప్పటి వాళ్ళ ఊహకి అందదు. ఆ పాలు తోడుబెడితే వచ్చే పెరుగు రుచీ అద్భుతం.

పిడకలు మెల్లగా కాలుతూ వుంటే పొగ క్రమక్రమంగా అలుముకుంటోంది. ఓ దుప్పటి చెవుల మీదుగా కప్పుకుని, ఆ దాలిదగ్గర అప్పుడప్పుడూ చేతులు వెచ్చజేసుకుంటూ కలల్లో తేలిపోవడం ఎంత బాగుంటుందో.

చల్లని గాలి వీస్తుంటే, కోళ్ళు లేచి జనాల్ని నిద్దరలేపుతుంటే, చెట్లమీదవుండే పక్షులు నిద్రలేచి చక్రికలు కొడుతూంటే, 'పాలమ్మా పాలు'అంటూ గొల్లభామలు పాలను ఇంటింటికీ అందిస్తుంటే, అప్పుడే పాలు తాగిన తువ్వాయిలు గంతులు వేస్తూ పరుగులు తీస్తూ తల్లితో ఆడుకుంటుంటే, తెల్లారీ తెల్లారకముందే సీతాకోకచిలుకలు విచ్చీ విచ్చని పువ్వుల మీద వాలి అందమైన రెక్కల్ని అల్లార్చుతుంటే, కళ్ళు నులుముకుంటూ బయటికి వచ్చిన కన్నెలు కళ్ళాపు జల్లి అందంగా ముగ్గులు వేస్తుంటే, స్నానానికి కాగుతున్న వేన్నీళ్ళు తెరలు తెరలుగా 'ఆవిర్ల'ను గాలిలోకి వదులుతుంటే, తృప్తిగా కుడితి తాగిన ఎద్దులు తలలు వూగిస్తూ మెడలోని గంటలు గణగణలాడిస్తుంటే, మంచినీళ్ళ కోసం చెలం బావి దగ్గరకు వెళ్ళిన ఆడవాళ్ళు ఒళ్ళంతా నీళ్ళు గుమ్మరించుకుని 'మడి'తో తడిబట్టలతో ఇళ్ళకి నీళ్ళబిందెలు తీసుకొస్తుంటే, సాతాని జియ్యర్లు తలమీద పాత్రలో శృతి శుభ గంగా భగవన్నామస్మరణ చేస్తూ మనసుని పరవశింపజేస్తుంటే పాలేళ్ళ కోసం పొద్దున్నే ఉడుకుతున్న అన్నం  కుతకుతా శబ్దం చేస్తుంటే, నిద్రలేచిన శిశువులు కొంతమంది ఏడుస్తుంటే, మరి కొంతమంది పాలతో కడుపు నింపుకున్నాక కేరింతలు కొడుతుంటే, కాకులు చిలకలు పిచ్చికలూ వాటి వాటి భాషలో పొద్దున్నే హడావిడి చేస్తుంటే, రాత్రి కురిసిన మంచుకి తడిసిన 'భూమి వాసన' శ్వాసద్వారా గుండెల్లోకి పోయి ఓ విచిత్రమైన పరిమళంతో గిలిగింతలు పెడుతుంటే - సగం మూసిన కళ్ళతో నేను కలలుగనేదాన్ని.

"ఎంతసేపే? ఓ పక్క స్కూలికి టైమ్ అవుతోంది. ఎంతసేపు కూర్చుంటావ్?" అని గాఠిగా అరిచి మా అమ్మ నా కలలకి ఫుల్‌స్టాప్ పెట్టేది.

శీతాకాలంలో పగలు తక్కువ.. రాత్రి ఎక్కువ. రోజులు 'ఇట్టే' గడిచిపోయేవి. బావిలో నీళ్ళు మాత్రం మహావెచ్చగా ఉండేవి. చెరువు నీళ్ళయితే అంతే సంగతులు. నీళ్ళకి వేళ్ళు తగిల్తే చాలు.. 'జివ్వు'మని ప్రాణం లాగేసేది. ఎంత చలి అయినా మా అమ్మ కార్తీక స్నానాలు చేసేది. చన్నీళ్ళతోటే చెయ్యాలిట. వేడినీళ్ళు అసలు వాడకూడదుట. కార్తీకమాసంలో శివాలయం భక్తులతో కిటకిటలాడేది. మా శివాలయంలో కొలువున్నది 'శూలినీదుర్గాంబ, యోగలింగేశ్వరుడూ.' గాలి అగరువత్తుల పరిమళాన్ని సంతరించుకునేది.

ఆశ్రమంలోనూ కార్తీక మాసపు పూజలు వైభవంగా జరిగేవి. విశ్వనాథుడు గదా కొలువున్నదీ! అమ్మవారి పేరు శ్రీరాజరాజేశ్వరి.

బిల్వదళాలకోసం పోటీపడేవాళ్ళం. ఆశ్రమంలో బిల్వవృక్షం వుంది. శివాలయంలోనూ ఉంది. బిల్వదళాన్ని శివుడికి అర్పిస్తే చాలు 'బోలెడు' పుణ్యం మన ఎక్కౌంట్‌లోకి వచ్చేస్తుందని పిల్లలమైన మా నమ్మకం. పుణ్యం సంగతి పక్కన పెడితే, ఇటు శివాలయంలోనూ అటు ఆశ్రమంలోనూ కూడా 'దండిగా' ప్రసాదాలు దొరికేవి. వాటి రుచే వేరు.

"అదేమిటే అమ్మా.! గుళ్ళో చేసిన పులిహోర రుచి నువ్వు చేస్తే ఎందుకురాదూ?" అని ఓ రోజున అడిగేశా.

"చూశారుటండీ.! పులిహోర చేస్తే కంచెడు కంచెడు మింగుతుంది, గుళ్ళో పులిహోర రుచి నేను చేస్తే రాదా? కృతజ్ఞత అనేది మీ వంశానికి ఏడిస్తేగా?" అని మా అమ్మ 'వంశవృక్షం' తీసేది.

"నువ్వు చేసింది బాగోలేదనలేదే మా లక్ష్మి కూతురా, అక్కడిదీ బాగుందని అన్నాను!" అని నేను సర్దబోయేదాన్ని.

"ఆ మాత్రం అర్థంచేసుకోలేని బుర్రకాదులే.! 'ఎడంచెయ్యి' అంటానికి బదులు 'పురచెయ్యి' అన్నాట్ట నీలాంటి వాడే ఎవడో.! అయినా పొద్దున్నే నా పని నేను చేసుకోక నీతో వాదులాటలెందుకలా?" అని వంట గదిలోకి నిష్క్రమించేది.

"అట్టా పుల్ల విరుపుగా అనకపోతే, 'అమ్మా నువ్వెంత బ్రహ్మాండంగా చేస్తావే. నీ పులిహోర రుచి లోకంలో ఉండదనుకో,' అని కాస్త పొగడకూడదే సీతా మీ అమ్మనీ!" నవ్వి అనేవాడు మా నాన్న.

"ఏమో నాన్నా.. ఆవిడ కాస్త 'చికాగ్గా' ఉంటేనే నాకు బాగుంటుంది.." నేనూ నవ్వేసేదాన్ని. దెబ్బలాడితే 'మన'జోలికిరాదుగదా! మనకి కావల్సింది అంతేగదా!

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments